## నేడు ఉచిత వైద్య శిబిరం

రంగారెడ్డినగర్: గాంధీనగర్‌లోని ఫాతిమా హెల్త్ కేర్ సెంటర్ అండ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు డాక్టర్ ఇఫ్తికరుల్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు జలుబు, జ్వరం, హైపర్ టెన్షన్, డయాబెటీస్, థైరాయిడ్, కీళ్ల నొప్పులతో బాధ పడేవారికి వైద్య సేవలు అందించనున్నారు. ఇతర వివరాలకు 7989528219 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్



జయభేరి కాలనీలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆదివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా జయభేరి కాలనీలో రోడ్డుపై చేరిన నీరు పలు ఇళ్లల్లోకి వెళ్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో సెల్లార్‌లోకి వర్షపు నీరు వెళ్లినట్లు గుర్తించారు. రాబోయే రోజుల్లో వర్షం నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌లో ఓ వ్యక్తి అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు తుల్పునారి జైహింద్‌గౌడ్ (51) ఇంటిని పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీల్లో 66 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో వైన్స్ నుంచి మద్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కీసర: కుటుంబకలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధి నాగారంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల మందమర్రికి చెందిన వేణుగోపాల్ (40) భార్య హారికతో కలిసి 2 నెలల క్రితం నాగారంలోని సత్యనారాయణ కాలనీకి వలస వచ్చాడు. వీరికి రెండేళ్ల కుమార్తె సంతానం. కాగా భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఈనెల 17న భర్త పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వర్సిటీల సమస్యలను పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వర్సిటీల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీబీసీ జేఏసీ ఛైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్ అన్నారు. ఆదివారం ఓయూలో జరిగిన పీహెచ్‌డీ పూర్తి చేసిన నిరుద్యోగుల సభలో ఆయన మాట్లాడారు. 13 ఏండ్లుగా ఉద్యోగాలను భర్తీ చేయనందున వర్సిటీలలో తీవ్రమైన అధ్యాపకుల కొరత ఉందని తక్షణం 3 వేల ఖాళీలను భర్తీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. వర్సిటీలకు బడ్జెట్ పెంచాలని, మౌతిక వసతులు పెంచాలని, ఉద్యోగాల భర్తీలో తక్కువ అధ్యాపకులు గల విభాగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. ఓయూలో అధికంగా బీసీ విద్యార్థులే చదవుతున్నారని పీహెచ్‌డీ ప్రవేశాలలో తగిన న్యాయం చేయాలని అధికారులను కోరారు.

## బీసీ విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. ఫీజుల పెంపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేమని చెప్పడం, పాలిటెక్నికల్ కోర్సుకు రూ.14, 500 ఫీజును 39 వేలకు పెంచారని, ఫీజులను బీసీ విద్యార్థులలే భరించాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం అత్యంత దారుణమన్నారు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లిస్తూ కేవలం బీసీలకు ఫీజులు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రవంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు బీసీల పక్షాన నిలబడి బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని లింగంగౌడ్ కోరారు.



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



నిజాంపేట్‌లో పలహారబండి ఊరేగింపులో పోతరాజులు



అయోధ్యనగర్‌లో బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు



నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో ..

# బోనమెత్తి.. భక్తితో సమర్పించి..

ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు | ఆలయాలకు క్యూ కట్టిన భక్తులు



బోనాలు ఉత్సవాలను ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఉండే మొక్కులు చెల్లించేందుకు వచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. మహిళలు, యువతులు కుటుంబ సమేతంగా బోనాలతో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి మొక్కులు సమర్పించారు. పోతరాజుల నృత్యాలు, పలహారబండి ఊరేగింపుతో బస్తీలు, కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది. – కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ హరిజనవాడలో బోనాల ఊరేగింపు



కుత్బుల్లాపూర్ గీతం గ్లోబెల్ స్కూల్‌లో..



జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో..



జయరాంనగర్ అమ్మవారి ఆలయం వద్ద బోనాలతో మహిళలు



బాచుపల్లి రేణుకా ఎల్లమ్మ కాలనీలో..



బాలయ్యనగర్‌లో బోనాల ఊరేగింపు



పండ్లు, కూరగాయలతో అలంకరించిన గాజులరామారం చిత్తారమ్మదేవి ఆలయం



దుండిగల్‌లో అమ్మవారి పూజలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు









పూజలో పాల్గొన్న కూన రాఘవేంద్రగౌడ్



## లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

నిజాంపేట్: ప్రగతి గనర్ లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి తొలి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రమేష్ అధ్యక్షత వహించారు. కాలనీ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. అసోసియేషన్ ఎన్నికల ద్వారా కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షులుగా గోవిందరాజులు, శాస్త్రీ, ప్రధాన కార్యదర్శిగా సంజయ్, కార్యదర్శులుగా డా.ప్రశాంత్, శ్రీకాంత్, కోశాధికారిగా సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా కల్యాణ్ ఎన్నియ్యారు. సమావేశంలో కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాల్సిన అంశాలు, భద్రతా ఏర్పాట్లు, దోమల నివారణ చర్యలు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, అంబీర్ చెరువు సుందరీకరణ తదితర అంశాలపై చర్చించారు. అసోసియేషన్ ఏర్పాటుకు సంఘీభావంగా పలు అపార్ట్‌మెంట్‌కు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

## సింహపురి కాలనీ చెరువు పరిశీలన



నిజాంపేట్: సింహపురి కాలనీ చెరువుని ఆకుల సతీష్ స్థానిక ప్రజలతో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుని అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్, మల్కాజిగిరి ఆర్డీఓ, ఇరిగేషన్ డీఈ దృష్టికి తీసుకెళ్లారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట గ్రామం సింహపురి కాలనీలో బలిజవానికుంట ఉందన్నారు. నాలాను పూడ్చి కొందరు కాంపౌండ్ వాల్ నిర్మించడం వల్ల నీళ్లు వెళ్లకపోవడంతో దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్వే నంబర్ 450లో ప్రభుత్వ భూమి 3.20 ఎకరాల్లో చెరువు విస్తీర్ణం పోను మిగతా ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయాలన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులను ఏర్పాటు చేసి, మిగిలిన ప్రభుత్వ స్థలంలో పార్క్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అరుణ్‌రావు, చందు, అశోక్‌రెడ్డి, రామ్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, రవీంద్ర, శేషు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీరు.. సాఫీగా వెళ్లేదెప్పుడు?

- వర్షం పడితే చాలు లోతట్టు ప్రాంతాల రహదారులు జలమయం
- బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న వైనం
- నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలంటున్న ప్రజలు



చింతల్ షాథియేటర్ వద్ద వర్షం పడితే ఇది పరిస్థితి

కుత్బుల్లాపూర్: ఇక్కడ వర్షం పడిందంటే చాలు కంటిమీద కునుక్కు కరువైనట్టే. వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందులను అధికారులు గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలి. కానీ అధికారులు ఆ దిశగా కార్యాచరణ రూపొందించకపోగా.. వారికి అనుకూలంగా ఉన్నచోట పనులు చేస్తూ ప్రభుత్వం నిధులను దారిమళ్లిస్తున్నారు. దీంతో వర్షం పడ్డ ప్రతిసారి కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధులన్నీ వర్షపు నీటితో 'గోదారిని' తలపిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయంపై అధికారులు ప్రత్యేక దష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

- జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీ ప్రధాన గేటు వద్ద వర్షపు నీరు ప్రతిసారి నిలవడం వల్ల ఆ కాలనీవాసులు రోడ్డు దాటలేకపోతున్నారు. ఈ విషయంపై కుత్బుల్లాపూర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నెల రోజుల క్రితం సర్వే చేసి ప్రత్యేకంగా వాన నీటి పైపులైన్ వేస్తామని హామీ ఇచ్చి వెళ్లారు. కానీ ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో వర్షం పడ్డ ప్రతిసారి రెండు మూడు గంటలసేపు ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో రోడ్డు నెంబర్-1 వాసుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అంతేకాకుండా ఆ నీరు వెళ్లే దాకా కాలనీవాసులు బయట అడుగుపెట్టలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.
- కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జయభేరి కాలనీలో ఎగువ ప్రాంతంలో ఉన్న కాలనీ వాసులు ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు, సెల్లార్ తవ్వకాలు చేపట్టడంతో వర్షపు నీరంతా రోడ్లపైకి చేరి ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో వివిధ కాలనీలకు వెళ్లే వాహనదారులు, ప్రజలు వర్షం పడ్డ ప్రతిసారి ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఇక్కడ రోడ్లు ఆక్రమించి నిర్మించిన వాటిని తొలగించి.. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా ప్రణాళికలు రూపొందించాలని పలువురు కోరుతున్నారు.
- సూరారం డివిజన్ మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద నర్సాపూర్ రాష్ట్ర రహదారి పై వర్షపు నీరు నిలవడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతుంది. వర్షం పడ్డ ప్రతిసారి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండటం విశేషం. స్థానికంగా వర్షపు నీరు వెళ్లేలా కాలువ ఉన్నప్పటికీ ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించి నిర్మాణం చేపట్టడంతో వర్షం పడ్డ ప్రతిసారి రోడ్డుపైకి నీరు చేరడం పరిపాటిగా మారింది. గతంలో ఇక్కడ సర్వే నిర్వహించిన ఫలితం లేకుండా పోయింది. అదేవిధంగా జీడిమెట్ల బస్ డిపో వద్ద కూడా ఇదే సమస్య ఏర్పడటం మూలంగా ప్రధాన రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌కు రంధ్రం చేసి నీటిని వెళ్లేలా చేశారు. కానీ అక్కడ కూడా ఇదే సమస్య ఎదురవుతుంది. చింతల్ షా థియేటర్ వద్ద కూడా భగత్‌సింగ్ నగర్, చంద్రనగర్ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు రోడ్డుపైకి చేరడంతో బాలానగర్ నుంచి చింతల్ వైపు వచ్చే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ ప్రధాన రోడ్డు ముందు గోదావరిని తలపిస్తున్న దృశ్యం